## క్లుప్తంగా

### మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

నెల్లూరు(క్రైమ్): జీవితాలను నాశనం చేసే మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు సూచించారు. మాదకద్రవ్యాల వినియోగంతో సంభవించే దుష్పరిణామాలపై అవగాహన సదస్సును కొత్తూరులోని కేంద్రీయ విద్యాలయంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే అనేక మంది మాదకద్రవ్యాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. అనంతరం మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ శంకరయ్య, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ జగదీశ్వర్‌రెడ్డి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నెల్లూరు – 1 ఇన్‌స్పెక్టర్ రమేష్‌బాబు, ఎస్సై ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

### మద్యం షాపును తొలగించాల్సిందే


రహదారిని దిగ్బంధించిన స్థానికులు

నెల్లూరు(క్రైమ్): నగరంలోని పరమేశ్వరినగర్ వద్ద ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలంటూ స్థానికులు చేపట్టిన ఆందోళన సోమవారంతో 14వ రోజుకు చేరుకుంది. రహదారిని దిగ్బంధించి అధికారుల తీరును నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జనావాసాలు, దర్గా, పాఠశాలకు సమీపంలో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయడంతో శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దుకాణాన్ని తొలగించేంత వరకూ ఆందోళనను విరమించేదిలేదని స్పష్టం చేశారు. కాగా స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నా, ఎక్సైజ్ అధికారులు దగ్గరుండి మద్యం విక్రయాలు చేయించడంపై పలువురు అసహనం వ్యక్తం చేశారు.

### 'ఊర్జవీర్'పై అవగాహన



నెల్లూరు(వీఆర్సీసెంటర్): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఊర్జవీర్ పథకంపై ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లను అవగాహన కార్యక్రమాన్ని వెంకటేశ్వరపురంలోని విద్యుత్ సెక్షన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ చంద్ర ఆచారి మాట్లాడారు. ఈ పథకంపై సిబ్బంది, ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లకు అవగాహన కల్పించి, రిజిస్ట్రేషన్ల ప్రక్రియను చేపడుతున్నామని తెలిపారు. ఈఈఎస్సెల్‌కు సంబంధించిన ఎల్ఈడీ బల్బులు, ఉపకరణాలను వినియోగించడం ద్వారా 15 నుంచి 20 శాతం వరకు విద్యుత్ ఆదా అవుతుందని చెప్పారు. ఈ పరికరాలను కొనుగోలు చేస్తే ప్రతి నెలా వారి బ్యాంక్ ఖాతాల్లో నిర్దేశించిన మొత్తం జమవుతుందని వివరించారు. పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### కొడుకు వేధిస్తున్నాడు..


ఈశ్వరమ్మ

నెల్లూరు రూరల్: తనకు రావాల్సిన పొలం, ఇల్లు, బంగారాన్ని దక్కనీయకుండా పెద్ద కుమారుడు దశరథరామిరెడ్డి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆత్మకూరు మండలం రామస్వామిపల్లికి చెందిన ఈశ్వరమ్మ వాపోయారు. ఈ మేరకు కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రాన్ని ఆమె సమర్పించారు. ఇలా అయితే తనకు ఆత్మహత్యే శరణ్యమని చెప్పారు. అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.

### మార్కెట్ కమిటీ అధికారుల ప్రత్యేక డ్రైవ్

నెల్లూరు(సెంట్రల్): తనిఖీల్లో వ్యాపారుల నుంచి రూ.42.65 లక్షలను వసూలు చేశామని వ్యవసాయ మార్కెట్ కమిటీ జిల్లా అధికారి అనితాకుమారి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె మాట్లాడారు. ప్రత్యేక డ్రైవ్‌ను ఇటీవల నిర్వహించామని, పలువురు తమ లైసెన్స్‌లను రెన్యువల్ చేయలేదనే అంశం తేలిందన్నారు. వీరి నుంచి మార్కెట్ కమిటీకి రావాల్సిన రూ.21.15 లక్షల బకాయిలను వసూలు చేశామని పేర్కొన్నారు. జిల్లాలో మార్కెట్ కమిటీకి సంబంధించిన చెక్‌పోస్టుల వద్ద వ్యవసాయ ఉత్పత్తులను రవాణా చేసే వారి నుంచి రూ.21.50 లక్షలను కట్టించుకున్నామన్నారు.




దీపాలను వెలిగిస్తున్న భక్తులు

# కార్తీకం.. శుభకరం

కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని నగరంలోని వివిధ ఆలయాల్లో విశేష పూజలు చేశారు. మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరాలయం.. నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం, తదితర ఆలయాల్లో నిర్వహించిన పూజా కార్యక్రమాలకు భక్తులు విశేషంగా తరలివచ్చారు. కార్తీక దీపాలను వెలిగించారు.

– నెల్లూరు(బృందావనం)


నవాబుపేటలోని శివాలయంలో..


మూలస్థానేశ్వరాలయంలో విశేషాలంకారం

## అధునాతన సిగ్నలింగ్ వ్యవస్థకు ప్రణాళికలు


మాట్లాడుతున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యల్లో భాగంగా నగరంలోని ఏడు కూడళ్లలో సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నామని కమిషనర్ సూర్యతేజ తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎస్పీ కృష్ణకాంత్‌తో కలిసి ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, మ్యాట్రిక్స్, ఎస్పీటీ నెట్‌వర్క్ కంపెనీ ప్రతినిధులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. మొదటి దశలో భాగంగా ఏసీ కూరగాయల మార్కెట్, కేవీఆర్ పెట్రోల్ బంక్, కనకమహల్ కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నళ్లను ఏర్పాటు చేయనున్నామని వివరించారు. రెండో దశలో హరనాథపురం, రామలింగాపురం, వీఆర్సీ కూడళ్లలో ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. ఎస్పీటీ నెట్‌వర్క్ సంస్థతో రెండేళ్ల నిర్వహణ ఒప్పందం మేరకు రూ.1.39 కోట్లతో ప్రాజెక్ట్‌ను పూర్తి చేయనున్నామని ప్రకటించారు. అనంతరం ఎస్పీ మాట్లాడారు. సిగ్నలింగ్ వ్యవస్థను రెండు నెలల్లో పునరుద్ధరించనున్నామని, ట్రాఫిక్ నిబంధనలను పాటించని వారికి వీటి ద్వారానే అపరాధ రుసుమును విధించనున్నామని చెప్పారు.

# పాతనేరస్తుడి అరెస్ట్

• రూ.3.73 లక్షల సొత్తు స్వాధీనం


నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ వేణు

నెల్లూరు సిటీ: ఖాకీల కళ్లుగప్పి తిరుగుతున్న ఓ పాతనేరస్తుడ్ని నెల్లూరు రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్లో వివరాలను ఇన్‌స్పెక్టర్ వేణు సోమవారం వెల్లడించారు. నగరంలోని బీవీనగర్‌కు చెందిన సూర్యనారాయణ చెడు వ్యసనాలకు బానిసై దొంగగా మారారు. సీసీ కెమెరాల్లేని ప్రాంతాలను ఎంచుకొని దొంగతనాలకు పాల్పడసాగాడు. నెల్లూరు రూరల్ పోలీసులు, రూరల్ డీఎస్పీ ఐడీ పార్టీ సిబ్బంది అతని కదలికలపై నిఘా ఉంచి అదుపులోకి తీసుకున్నారు. ఈ ఏడాది అక్టోబర్‌లో నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన బైక్‌ను, నెల్లూరు రూరల్ మండలం యనమలవారిదిన్నెలో ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్, గుడిపల్లిపాడులో బైక్, నారాయణ హాస్పిటల్లో పార్క్ చేసిన బైక్, కావలిలోని జనతాపేటలో ఇంటి తాళాలను పగలగొట్టి రెండు ల్యాప్‌టాప్‌లు, తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలోని బ్రాహ్మణవీధిలో ఇంటి తాళాన్ని పగలగొట్టి ల్యాప్‌టాప్‌ను చోరీ చేసినట్లు విచారణలో అంగీకరించాడు. దీంతో నిందితుడ్ని అరెస్ట్ చేసి రూ.3.73 లక్షల విలువైన మూడు బైక్‌లు, మూడు ల్యాప్‌టాప్‌లు, ఒక గ్యాస్ సిలిండర్‌ను స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. సూర్యనారాయణపై పలు కేసులున్నాయని వెల్లడించారు. నిందితుడ్ని అరెస్ట్ చేయడంతో పాటు చోరీ సొత్తు రాబట్టేందుకు కృషి చేసిన ఇన్‌స్పెక్టర్ వేణు, ఎస్సైలు లక్ష్మణరావు, సుధీర్, డీఎస్పీ ఐడీ పార్టీ ఏఎస్సై గిరిధర్‌రావు, హెచ్‌సీ గంగాధర్, కానిస్టేబుళ్లు సతీష్, నెల్లూరు రూరల్ హెచ్‌సీ ఆదినారాయణ, కానిస్టేబుళ్లు చిరంజీవి, మోహన్‌కృష్ణను రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస్ అభినందించి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు.

## పార్కుల్లో యోగా శిక్షణకు ఏర్పాట్లు

నెల్లూరు(బారకాసు): నగరంలోని పార్కుల్లో యోగాను రోజూ నిర్వహించేందుకు వీలుగా అర్హులైన శిక్షకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కమిషనర్ సూర్యతేజ తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలను స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. నగరంలోని అన్ని పార్కుల్లో యోగా ప్రక్రియను అందుబాటులోకి తీసుకురానున్నామని వెల్లడించారు. ఆసక్తి గల శిక్షకులు నగరపాలక సంస్థ కార్యాలయంలో తమ పేర్లను శనివారంలోపు నమోదు చేసుకోవాలని కోరారు. ఒక్కో పార్కులో ఒక్కో శిక్షకుడ్ని నియమించి రోజూ ఉదయం ఆరు నుంచి ఏడు వరకు శిక్షణ కల్పించేలా చర్యలు చేపడతామని వెల్లడించారు. దరఖాస్తుదారులు తమ వివరాలను కమాండ్ కంట్రోల్ సెంటర్ వాట్సాప్ నంబర్ 94940 18118కు పంపాలని సూచించారు. పన్నులను బాధ్యతగా చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 34 అర్జీలు అందాయని తెలిపారు. అర్జీలు పునరావృతం కాకుండా అన్ని విభాగాధికారులు సమన్వయంతో పనిచేసి శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు.

➡ హౌసింగ్ విభాగాధికారులు, సచివాలయ అమెనిటీస్ కార్యదర్శులు, వీఆర్వోలతో సమీక్ష సమావేశాన్ని కమిషనర్ నిర్వహించారు. లబ్ధిదారులకు గృహాల కేటాయింపులో తలెత్తుతున్న వివిధ సమస్యలను సమావేశంలో చర్చించారు. అర్హులకు గృహాలను కేటాయించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

➡ ప్రతి ప్రాంతంలో వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కమిషనర్ కోరారు. ఇవి సమయానుకూలంగా పనిచేసేలా చూడాలని విద్యుత్ అధికారులు, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగాధికారులు, సచివాలయ కార్యదర్శులకు సూచించారు. మరమ్మతులకు గురైన వాటి స్థానంలో కొత్త దీపాలను ఏర్పాటు చేయాలని చెప్పారు.

## అయ్యప్పస్వామికి విశేష పూజలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని అయ్యప్ప దేవస్థానంలో మండల పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. అభిషేకాలు, ఉత్సవాలు, దీపారాధనలను వేడుకగా జరిపారు. ఉభయకర్తలుగా దేవరాల సుబ్రహ్మణ్యం, మస్తానమ్మ, కల్యాణ్, తేజశ్విని, సునీల్‌రెడ్డి, భారతి, నాగరాజు, నీరజ, శ్రీనివాసులు, రాజశ్రీ దంపతులు వ్యవహరించారు. అయ్యప్ప సేవా సమాజ పాలకమండలి అధ్యక్ష, కార్యదర్శులు శేషగిరిరావు, వెంకటరత్నం, కోశాధికారి రత్నయ్య తదితరులు పర్యవేక్షించారు.

### నేత్రపర్వంగా కల్యాణోత్సవం



నెల్లూరు(బృందావనం): కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని నగరంలోని గణేష్ ఘాట్ వద్ద గల స్వర్ణలింగేశ్వరస్వామి దేవస్థానంలో కామాక్షి సమేత స్వర్ణలింగేశ్వరస్వామికి శాంతి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. సురేందర్‌రెడ్డి, స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడి సతీమణి ఉషా పాల్గొన్నారు.

### వేదగిరిలో హుండీ కానుకల లెక్కింపు



నెల్లూరు సిటీ: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన హుండీ కానుకలను సోమవారం లెక్కించారు. గత 65 రోజులకు గానూ కానుకల రూపంలో భక్తులు రూ.5,99,268 మేర సమర్పించారు. ఈఓ వేమూరి గోపీ పాల్గొన్నారు.

### విశ్రాంత ఉద్యోగుల సర్వసభ్య సమావేశం రేపు

నెల్లూరు(అర్బన్): విశ్రాంత ఉద్యోగుల సర్వసభ్య సమావేశాన్ని టౌన్‌హాల్లో బుధవారం సాయంత్రం నిర్వహించనున్నామని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మీనారాయణ, వెంకయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి హాజరుకావాలని కోరారు.

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 33 / 11 కేవీ శెట్టిగుంట రోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలో లైన్లను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మంగళవారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడో మైలు, ప్రశాంతినగర్, కిసాన్‌నగర్, మైపాడు రోడ్డు, బృందావనం తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

### నారాయణరెడ్డిపేట సబ్‌స్టేషన్‌కు మార్పు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): అల్లీపురంలోని టిడ్కో గృహ సముదాయాలకు సంబంధించిన విద్యుత్ శాఖ కార్యకలాపాలను నారాయణరెడ్డిపేట సెక్షన్‌కు మరుస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులను సోమవారం జారీ చేశారు. వాస్తవానికి అల్లీపురం, అక్కడి టిడ్కో గృహ సముదాయాలు నారాయణరెడ్డిపేట సబ్‌స్టేషన్ పరిధిలోనే గతంలో ఉండేవి. అయితే వెంకటేశ్వరపురం సెక్షన్ కార్యాలయం ఏర్పడ్డాక వీటిని ఇక్కడికి మార్చారు. అయితే తాజా ఉత్తర్వుల మేరకు అల్లీపురం టిడ్కో గృహ సముదాయాలను నారాయణరెడ్డిపేట సబ్‌స్టేషన్ పరిధిలోకి మార్చారు. అల్లీపురానికి సంబంధించిన కార్యకలాపాలను సైతం ఆ సబ్‌స్టేషన్ పరిధిలోకి తీసుకొచ్చే అవకాశం ఉందని సమాచారం.

### కళాకారుడికి సన్మానం

నెల్లూరు(బృందావనం): సుబేదారుపేటలో కళాకారుడు గోపాలస్వామిని కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు సోమవారం సత్కరించారు. ముఖ్యఅతిథిగా 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి హాజరయ్యారు. ప్రదీప్, రఘురామిరెడ్డి, రమణయ్య, అమానుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

### పది పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

నెల్లూరు (టౌన్): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ఫీజు గడువును ఈ నెల 26 వరకు పొడిగించారని డీఈఓ బాలాజీరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుముతో వచ్చే నెల రెండు వరకు, రూ.200 రుసుముతో తొమ్మిది వరకు, రూ.500 రుసుముతో 16వ తేదీ వరకు చెల్లించొచ్చని చెప్పారు.

### సచివాలయాల వద్ద ఆందోళన



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలోని సచివాలయాల వద్ద నిరసనను సీపీఐ, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మున్నా, సీపీఐ కార్యదర్శి సర్దార్ మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే పట్టణ ప్రాంతాల్లో మూడు.. గ్రామీణ ప్రాంతాల్లో రెండు సెంట్లను ఇస్తామని ఎన్నికలకు ముందు టీడీపీ హామీ ఇచ్చిందని, దీన్ని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఐదు లక్షల పక్కా గృహాలను నిర్మించాలని, వీటిని అమలు చేయకపోతే ప్రజాగ్రహానికి గురికావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం వినతిపత్రాన్ని సమర్పించారు. నేతలు గౌస్‌బాషా, బాదుల్లా, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

## ప్రస్తుత పనివేళలనే కొనసాగించాలి


డీఈఓకు వినతిపత్రమిస్తున్న ఫ్యాప్టో నేతలు

నెల్లూరు (టౌన్): పాఠశాలల్లో ప్రస్తుతం అమలవుతున్న పనివేళలనే కొనసాగించాలని ఫ్యాప్టో చైర్మన్ సురేంద్రరెడ్డి, సెక్రటరీ జనరల్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ బాలాజీరావుకు వినతిపత్రాన్ని సోమవారం అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా జిల్లాలోని పాఠశాలల పనివేళలను ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మారుస్తూ ఉత్తర్వులను జారీ చేశారని తెలిపారు. దీంతో దూర ప్రాంత విద్యార్థులు ఇబ్బంది పడే అవకాశం ఉందని చెప్పారు. ఫ్యాప్టో డిప్యూటీ సెక్రటరీ జనరల్ హజరత్, కార్యదర్శి చలపతి, కార్యవర్గ సభ్యులు దశరథరాములు, పిచ్చిబాబు, చలపతిశర్మ తదితరులు పాల్గొన్నారు.

## బ్రిడ్జిని పునర్నిర్మించాలని వినతి



నెల్లూరు రూరల్: నెల్లూరు చెరువు నుంచి నీటిని తీసుకొచ్చే లోలెవల్ కాలువపై కూలిపోయిన బ్రిడ్జిని పునర్నిర్మించాలని బీజేపీ నేత మిడతల రమేష్ కోరారు. ఈ మేరకు నగరంలోని పీడబ్ల్యూడీ కార్యాలయంలో ఆ శాఖ సెంట్రల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగరాజుకు వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అల్లూరు నాగేంద్రసింగ్, రత్ననాయుడు, నీలిశెట్టి లక్ష్మణరావు, రాములు, నారాయణయాదవ్, నారాయణరావు, జయచంద్ర, కేశవ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## రంగడి ఆలయంలో వేలం



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానానికి సంబంధించిన దుకాణాలు, గృహాలు, ఖాళీ స్థలానికి బహిరంగ వేలాన్ని సోమవారం నిర్వహించారు. రంగనాయకి అమ్మవారి మండపంలో వేలాన్ని ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిపారు. ఈ ఏడాది డిసెంబర్ ఒకటి నుంచి, 2027, నవంబర్ 30 వరకు లీజు హక్కును పలువురు పొందారు. వినాయక హాల్ ఎదురుగా ఉన్న రెండు షాపులను నెలకు రూ.12,200 చొప్పున.. నవాబుపేటలోని పత్తివారి స్కూల్ వద్ద నూతనంగా నిర్మించిన నాలుగు షాపులను రూ.34,700 చొప్పున.. చిత్రకూటం నవాబుపేట వద్ద రెండు షాపులను రూ.12,200 చొప్పున.. గోపురం వీధిలోని ఇంటిని నెలకు రూ.4,800.. ఖాళీగా ఉన్న స్థలాన్ని నెలకు రూ.5500కు దక్కించుకున్నారు. దేవదాయ శాఖ పరిశీలకుడు సుధీర్ పాల్గొన్నారు.

## సంఘాల మధ్య సహకారం అవసరం


మాట్లాడుతున్న గుర్రప్ప

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని అన్ని సహకార సంఘాలు పరస్పరం సహకరించుకోవాలని డీసీఓ గుర్రప్ప పేర్కొన్నారు. రామ్మూర్తినగర్‌లోని గుండ్లపాళెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జాతీయ, రాష్ట్ర స్థాయి సమాఖ్యలు సాంకేతికత, అనుభవాలు, మార్కెటింగ్, నెట్‌వర్క్‌ల అనుసంధానంతో పనిచేస్తే అన్ని సంఘాలు బలోపేతమవుతాయని చెప్పారు. అనంతరం మొక్కలు నాటారు. సహకార శాఖ ఆడిట్ అధికారి తిరుపతయ్య, సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆదినారాయణ, మునిప్రసాద్, మోజెస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలలో అన్యమత ప్రచారంపై నిరసన



నెల్లూరు(బృందావనం): తిరుమలలోని పాపవినాశంలో అన్యమత ప్రచారం చేయడాన్ని నిరసిస్తూ నగరంలోని రామలింగాపురం సెంటర్‌లో నిరసనను బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ నేత మిడతల రమేష్ మాట్లాడారు. తిరుమలలో ఉద్యోగాలు చేస్తున్న అన్యమతస్తులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. సనాతన ధర్మాన్ని కాపాడేలా ఆలయాల్లో హిందువులే పనిచేసేలా రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని కోరారు.

## రక్త పరీక్షలను పక్కాగా నిర్వహించాలి


మాట్లాడుతున్న పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): వైద్య ప్రమాణాలకు అనుగుణంగా రక్త పరీక్షలను నాణ్యతతో ల్యాబ్ టెక్నీషియన్లు నిర్వహించాలని డీఎంహెచ్ఓ పెంచలయ్య సూచించారు. జిల్లాలోని పీహెచ్‌సీలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లకు నగరంలోని వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్షయ, డెంగీ, మలేరియా, ఫైలేరియా తదితర పరీక్షలను ల్యాబ్ టెక్నీషియన్లు సకాలంలో నిర్వహించి ఫలితాలను డాక్టర్లకు అందజేయాలని కోరారు. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం, విజయవాడకు చెందిన ప్రపంచ ఆరోగ్య సంస్థ లెవస్ వన్ టెక్నీషియన్ లక్ష్మీసుభద్ర, జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ, ఏఎంఓ నాగార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన కీలకం




నెల్లూరు(అర్బన్): ప్రకృతి వైపరీత్యాలు, వాటితో సంభవించే కష్టనష్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జేసీ కార్తీక్ సూచించారు. వరదలు, అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయాల్లో పాటించాల్సిన జాగ్రత్తలపై జిల్లా అధికారులకు ఎన్డీఆర్ఎఫ్ అధికారులు అవగాహన కల్పించారు. కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో డీఆర్వో ఉదయభాస్కర్, ప్రకృతి వైపరీత్యాల స్పందన శాఖ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వీరశేఖర్, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, డ్వామా పీడీ గంగాభవాని, డీఆర్డీఏ పీడీ నాగరాజకుమారి పాల్గొన్నారు.

## విద్యార్థులకు దంత పరీక్షలు



నెల్లూరు (టౌన్): కొండాయపాళెంలోని నగరపాలక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దంత పరీక్షలను నారాయణ దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. వైద్యులు అంజలీకృష్ణ, లక్ష్మీపల్లవి, దిలీప్‌కృష్ణ, సౌజన్య, హర్షశ్రీ, హెచ్ఎం భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు సోమేశ్వరరావు, కిరణ్, విద్యా వలంటీర్ రాణీ పాల్గొన్నారు.

## ఫిట్‌డాప్ అధ్యక్షుడిగా దీపక్



నెల్లూరు(బృందావనం): ఫెడరేషన్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డీలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఫిట్‌డాప్) అధ్యక్షుడిగా నెల్లూరుకు చెందిన దీపక్ బొమ్మిశెట్టి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీనికి సంబంధించిన వివరాలను సోమవారం ఆయన తెలియజేశారు. రాజమహేంద్రవరంలో ఫిట్‌డాప్ సమావేశాన్ని రాజమహేంద్రవరం, కాకినాడకు చెందిన ఐటీ డీలర్ల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారని చెప్పారు. మార్కెట్లో ఎదురవుతున్న సమస్యలను అధిగమించడం తదితరాలపై చర్చించామని తెలిపారు. రాష్ట్రంలోని ఐటీ డీలర్ల సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో ఫిట్‌డాప్‌ను ప్రారంభించామన్నారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నామని వెల్లడించారు.

### సెంట్రల్ జైలుకు తరలింపు

నెల్లూరు(క్రైమ్): గుంటూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ వెంకటరామిరెడ్డిపై దర్గామిట్ట పోలీస్‌స్టేషన్లో కేసు ఈ నెల పదిన నమోదైంది. కావలి సబ్ జైల్లో రిమాండ్‌లో ఉన్న ఈయన్ను పీటీ వారెంట్‌పై దర్గామిట్ట పోలీసులు అదుపులోకి సోమవారం తీసుకున్నారు. అనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా, 14 రోజుల రిమాండ్‌ను విధించారు. దీంతో వెంకటరామిరెడ్డిని జిల్లా కేంద్ర కారాగారానికి పోలీసులు తరలించారు.